

# మరో అడుగు

## - డా.వేదుల సుభద్ర



**(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)**

తమ గదికి కూడా వెళ్ళకుండా అమ్మా నాన్నల మంచం మీదే ఒరిగిపోయిన స్వప్నిక కి దుప్పటి కప్పి, పెద్ద లైట్ ఆర్పేసి, చిన్న లైటు వేసింది రాధిక. ఆ లేత నీలపు కాంతిలో స్వప్నిక అలసిన ముఖాన్నే చూస్తూ అక్కడే కూర్చుంది.

" నువ్వు స్వప్ని దగ్గర పడుకుంటావా? నేను, సాహిల్ అక్కడ పడుకుంటాం" అన్నాడు కిరణ్.

చిన్నగా తల ఊపుతూ పక్కనే నిలబడిన కిరణ్ చెయ్యి గట్టిగా పట్టుకుంది. మాట చెప్పలేని భావాలు చెప్పడం ఒక్కోసారి స్పర్శకే సాధ్యం.

" ఏమీ కాదు, కళ్ళు మూసుకుని హాయిగా పడుకో" అన్నాడు వంగి ఆమె నుదిటిని ముద్దు పెట్టి, తల మీద తడుతూ.

ఇద్దరిమధ్యనా కొన్ని క్షణాల పాటు మౌనం.

"గుడ్ నైట్ రాధీ" అంటూ పక్కగదిలోకి నడిచాడు.

పడుకుందన్నమాటే గానీ ఓ పట్టాన నిద్ర రాలేదు రాధిక కి. ఇవీ అని చెప్పలేని ఆలోచనలు మనసంతా గజిబిజిగా.

'నువ్వేదైనా ఉద్యోగం చూసుకోవడమో లేదా ఏదైనా వ్యాపకం పెట్టుకోవడమో చెయ్యాలి రాధీ. లేకపోతే నీ ధ్యాసంతా మాముగ్గురిమీదే పెట్టుకుని ప్రతీ చిన్న విషయానికీ అతిగా ఆలోచించి బాధపడతావు. దానివల్ల ఏం ఉపయోగం చెప్పు?' భర్త ఎప్పుడూ అనే మాటలు గుర్తు చేసుకుంటూ నిద్రపోవడానికి ప్రయత్నించింది

---

మనసులో ముసురుతున్న ఆలోచనలని మరల్చుకోవడానికి ప్రయత్నించసాగాడు.

పక్కగదిలో పడుకున్న కిరణ్ పరిస్థితి అంతకంటే భిన్నంగా ఏమీ లేదు.

ఫొటోగ్రాఫర్ కావడం వల్లనో, స్వతహాగా వచ్చిన లక్షణమో మరి, ఫోకస్ అంటే తగని మక్కువ అతనికి.

పిల్లలకి కూడా ఎప్పుడూ అదే చెప్పేవాడు.

ద్రోణాచార్యుడు తమ శిష్యులైన కౌరవులకీ, పాండవులకీ చెట్టు మీదపక్షి ని చూపించి 'ఏం కనిపిస్తోంది'? అని అడుగుతూ విలువిద్య నేర్పించే కథని తరచుగా చెప్పేవాడు.

చెప్పిన ప్రతీసారీ కొత్తగా వింటున్నట్టుగా వినేది స్వప్నిక.

సాహిల్ మాత్రం 'తెలుసుగా నాన్నా, ఒక్క అర్జునుడు తప్ప మిగతా అందరూ పక్షి కనిపించిందన్నారు, ఒక్క అర్జునుడు మాత్రమే పక్షి కన్ను కనిపిస్తోంది అన్నాడు' కదా. అంటూ ముందే నవ్వేస్తాడు.

స్వప్నిక మాత్రం 'ఉండరా, నాన్న చెప్తే ఆ కథ ఎన్ని సార్లైనా వినాలనిపిస్తుంది, నువ్వు అడ్డు రాకు' అంటూ తమ్ముడిని విసుక్కుంటుంది.

'కూర్చుని కుదురుగా కథ కూడా వినలేవు. అందుకే నీకు దేంట్లోనూ ఫోకస్ లేదు ' అంటుంది.

'నీకే ఫోకస్ లేనిది, అందుకే ఎన్ని సార్లు చెప్పినా మళ్ళీ వింటూనే ఉంటావు.నాకైతే ఆ కథ అంతా కంఠతా వచ్చు తెల్సా, ఇప్పుడు చెప్పు ఎవరికి ఫోకస్ ఉందో?" అంటాడు .వాడికి అక్కని ఏడిపించడమంటే మహా సరదా. ఎప్పుడూ జరిగేదే అది.

"ఇంకా చిన్నవాడు కదరా, మరో రెండేళ్ళకి చూడు" అంటాడు తను.

అవన్నీ గుర్తు చేసుకుంటూ కొడుకు వైపుకు తిరిగాడు కిరణ్. ఎప్పటిలాగే వాడి కాలు ఎత్తి నాన్న మీద పడేసి దగ్గరగా జరిగాడు సాహిల్.

చిరునవ్వుతో వాడిని దగ్గరగా హత్తుకుని పడుకున్నాడు కిరణ్

అలా నెమ్మదిగా ఆ రాత్రి నిద్రపోయింది..

---

తెల్లవారకుండానే కిరణ్ సెల్ ఫోన్ మ్రోగింది. " ఏమయిందిరా? స్వప్నమ్మ పడిపోయిందిట? ఎలా ఉంది ఇప్పుడు? జ్వరం, గిరం రాలేదు కదా?" ఆత్రుతగా అడిగిన తండ్రి మాటలకి

" అబ్బే! ఎండకి నీరసపడి పడినట్టుంది నాన్నా, వెంటనే లేచింది, బహుమతి కూడా తీసుకుంది. హాయిగా నిద్రపోతోంది" అంటూ చెప్పి

" ఇంతలో నే నీకెవరు చెప్పారు?" అంటూ అడిగాడు. అది రాధిక పనే అయి ఉంటుందని అతనికి తెలుసు.

" ఎవరు చెప్తేనేం లే? పిల్లదానికి తగ్గిందన్నావు చాలు. వెంటనే ఓ ఫోన్ చేస్తే నీ సొమ్మేం పోతుందిరా?" అంటూ కేకలేశాడు.

మరో రెండు నిమిషాలు మాట్లాడి పెట్టేశాడాయన.

కిరణ్ కి తర్వాత నిద్ర రాలేదు. లేచి పక్క గదిలో నిద్ర పోతున్న రాధిక, స్వప్నిక లని చూసి వచ్చాడు. కంగారు పడవలసిందేమీ కనిపించకపోవడంతో తృప్తిగా నిట్టూర్చాడు.

తర్వాత పెరటి గుమ్మం తలుపు తీసి మెట్లమీద కూర్చున్నాడు. ఇంకా పూర్తిగా విడిపోని చీకటి. నెమ్మదిగా వీస్తున్న గాలి, పక్కనే ఉన్న పారిజాతం చెట్టు పంచుతున్న సువాసనలు.

'నీ చిన్నప్పుడు నువ్వు పెట్టిన పరుగులు సరిపోలేదా, దాన్నెందుకు రా ఇబ్బంది పెట్టడం? చదువులు, ఆటలు, అలసిపోవడం లేదూ పిల్ల? చాలింక. ఇలాగే పడి ఏ కాలో చెయ్యో విరక్కొట్టుకుంటే లేనిపోనిది?' ఫోనులో తండ్రి మాటలు గుర్తొచ్చి నవ్వుకున్నాడు.

'నాన్న చెప్పింది నిజమే. ఎలావచ్చిందో తనకి ఆటలమీద, ముఖ్యంగా పరుగు పందాలు, కబడ్డీ మీద ఇష్టం. చిన్నప్పటినించీ ఇష్టమున్నా, దానిమీదే ఫోకస్ పెట్టేలా చేసినది మాత్రం ఆ సినిమాయే తనకి గుర్తున్నంతవరకూ.

మావయ్య వాళ్ళింటికి వేసవి శలవులకి హైదరాబాద్ వచ్చినప్పుడు చిన్నతనాన చూసిన. 'ఛారియెట్స్ ఆఫ్ ఫైర్' అనే ఆ ఇంగ్లీష్ సినిమాలో ఇద్దరు ఆటగాళ్ళు 1924 ఒలింపిక్స్ లో పోటీలో పాల్గొంటారు. ఆ సినిమాలో ఆ పరుగుపందాలని చూపించిన విధానమూ, ఇచ్చే సందేశమూ తన మనసులో ఎంతో బలంగా నాటుకుపోయాయి. అదే తన ఇష్టానికి ముఖ్య కారణం అయ్యాయి.

తనలాగే తన పిల్లలూ ఉంటారు కదా, నాన్న ఎప్పుడూ అలాగే అంటారు. ఆ మాటకొస్తే స్వపి నడిచిందా అసలు? ఎప్పుడూ పరుగులే కదూ'. అనుకున్నాడు

స్వప్నిక వేసిన మొదటి అడుగు ఇంకా గుర్తుంది తనకి. మరో రెండు రోజుల్లో మొదటి పుట్టినరోజు అనగా తనూ, స్వప్నిక, రాధికా ముగ్గురూ నేలమీద కూర్చుని బాల్ దొర్లించుకుంటూ ఆడుకుంటున్నారు. ఇంతలో హఠాత్తుగా స్వప్నిక తన దగ్గరకి దొర్లుకుంటూ వచ్చిన బంతి మీద చేతులు అదిమిపెట్టి, ఒక్క ఉదుటున లేచి నిలబడింది.వెంటనే ఆ బాల్ చేతిలోకి తీసుకుని తడబడుతూ నాలుగు తప్పటడుగులు గబ గబా వేసింది.

అంతే, ఆపైన ఆగింది లేదు, వెనక్కి తిరిగి చూసింది లేదు.

కిల కిలా నవ్వుతూ, గబ గబా పరుగులాంటి నడకతో ఇల్లంతా తిరిగింది. ఎంత ఆపినా ఆగలేదు, అలసి పోయి నిద్ర వచ్చేదాకా. ఆ పరుగు అప్పటినించీ సాగుతూనే ఉంది

నర్సరీ స్కూల్ నించీ నేటిదాకా ఏ పరుగు పోటీలోనైనా మొదటి బహుమతే.

'దానికెంత వయసుందో, పరుగుమీద తనకున్న ఇష్టానికి అంతే వయసు ' అనే చెప్తాడు తను ఇప్పటికీ.

జీన్స్ (జన్యువులు) ఎప్పుడూ అబద్ధం చెప్పవు కదా అని కూడా అంటాడు తన స్నేహితులతోనూ, తెలిసినవారితోనూ.

రెండు కప్పుల్లో కాఫీలతో వచ్చింది రాధిక. ఒకటి అతనికిచ్చి తనొకటి తీసుకుంటూ అంది " రాత్రి బాగానే నిద్రపోయింది, మీరన్నది నిజమే. కంగారు పడాల్సిందేమీ లేదు" అంది సంతోషంగా.

" జ్వరం?"

" లేదుగా, మూడుసార్లు చూశాను" అంది..

"ఈ రోజు శలవు కదా, రేపటికంతా సర్దుకుంటుంది" అన్నాడు కిరణ్ కూడా.

" కొన్నాళ్ళపాటు రన్నింగ్ ఆపేస్తే మంచిదేమో" అంది నెమ్మదిగా.

" కమాన్ రాధీ. నేషనల్ చాంపియన్ కావాలన్నది దాని చిన్నప్పటి కల, ఇప్పుడల్లంత దూరంలో ఉంది అది. గెలుతుందా, లేదా పక్కన పెడితే కనీసం పాల్గొనాలి కదా. ఎన్ని వందలమంది కల గంటారో తెల్సా, మన స్వప్ని ఉన్న చోట ఉండాలని". ఇంకా ఏదో చెప్తున్న భర్త వైపు కొద్దిగా కోపంగా చూస్తూ..

" తెల్సు, అవన్నీ ఇన్నేళ్ళుగా వింటూనే ఉన్నాను. అయినా నిన్న అలా ఎందుకు పడిపోయిందో అని నాకెంత బెంగగా ఉందో తెలుసా? అసలేమయి ఉంటుంది? అంది ఆత్రంగా" అంది.

" మొదలు పెట్టావా? అలసట అనుకున్నాం కదా, బాలన్ సర్ కూడా అదే అన్నారు" అన్నాడు.

" మనం అనుకున్నాం, ఆయన కూడా అదే అన్నారు. మనమెవ్వరమూ డాక్టర్లం కాదు" అంది కోపంగా.

" నాకర్థం అయింది నువ్వు చెప్పేది. ప్రస్తుతానికి తగ్గింది కదా, యూనిట్ పరీక్షలయ్యాకా డాక్టర్ దగ్గరకి తీసుకువెళ్దాం' అన్నాడు

స్వప్నిక ఆటల్లోకి వెళ్ళడం రాధిక కి మొదట్లో పెద్దగా ఇష్టం లేకపోయినా పిల్ల వరసగా ప్రైజులు గెలవడంతో ఆమె మనసు మారింది.

ఎంచుకున్న రంగంలో ఒక స్థాయికి వెళ్ళడం ఎంత కష్టమో కిరణ్ కి బాగా తెలుసు. తమలాంటి మధ్యతరగతివారికి, అందులోనూ తనలాంటి మాములు ఉద్యోగస్థుడికి.

అదృష్టవశాతూ తను పనిచేసే యూనివర్సిటీలో ఉన్న రన్నింగ్ ఇన్స్ట్రక్టర్ చాలా మంచివాడు, సమర్థుడు. తను మొదలుపెట్టినా ఆయనే తొలి గురువు అనుకోవచ్చు. చాలా క్రమశిక్షణతో శిక్షణ ఇచ్చేవాడు.

అలామొదట యూనివర్సిటీలో ప్రారంభమైన ఆమె శిక్షణ కిరణ్ స్నేహితుల వల్ల, వాళ్ళ సిఫార్సుల వల్లే నడిచింది. రిటైర్ అయి తన స్వంత ట్రెయినింగ్ సెంటర్ నడుపుతున్న బాలన్ గారు కలిసేంతవరకూ.

తన స్నేహితుడు శేఖర్ కి దూరపు బంధువులు బాలన్ గారు. దానివల్లనే మొదట స్వప్నికని తీసుకున్నా, తర్వాత ఆమె నైపుణ్యం చూసి ప్రత్యేక శ్రద్ధతో కోచింగ్ ఇచ్చేవారాయన.

పిల్లలని ఎంతో ప్రేమ గా చూసుకుంటూ, దగ్గరుండి శ్రద్ధగా నేర్పించే ఆయన ఫీజ్ విషయం లో మాత్రం నిక్కచ్చిగా ఉంటాబూ. ఒకటో తారీకు వచ్చేసరికి ఇచ్చెయ్యాలి.

తన ఒక్క జీతంతో ఇల్లూ, చదువులూ కాక స్వప్నిక కి కావలసిన వనరులు సమకూర్చడం అతని శక్తి కి మించిన పనే అయినా ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. స్నేహితుల దగ్గర తరచుగా అప్పులు తేవడమే కాక తనకున్న చిన్న స్థలం కూడా అమ్మేశాడు కూడా.

కూర్చుకునేది అట్టే పోయింది, ఉన్నవి కూడా నాశనం చేస్తున్నాడని తండ్రి తోటి తిట్లు తిన్నాడు.

'చూద్దాం లే నాన్నా, రిటైర్ అయ్యేవరకూ ఈ క్వార్టర్ ఉంది, ఆపైన మాట కదా' అంటే ఆయన గుర్రుగా చూసిన చూపు ఇప్పటికీ గుర్తుంది కిరణ్ కి.

ఆదివారం మాములుగానే సందడిగా గడిచింది.

సోమవారం పొద్దున్నే లేచారు పిల్లలిద్దరూ..

" అమ్మా, ఈ రోజు అసెంబ్లీ లో నాకూ, సీమ కూ స్టేజ్ మీదకి పిలిచి ప్రైజులిస్తారు, తెల్సు క్దాతెలుసు కదా" అంది స్వప్నిక సంతోషంగా.

" నిజమే, నేను మర్చిపోయాను. ప్రిన్సిపల్ ఏమన్నారో చెప్పు వచ్చాక" అంది చిరునవ్వుతో.

పిల్లలిద్దరినీ బస్ ఎక్కించడానికి వెళ్ళింది రాధిక.బస్ లో పిల్లలందరూ స్వప్నని అభినందిచడం చూసి రాధికకెంతో సంతోషంగా అనిపించింది.

సీమ గబ గబా పక్కకి జరిగి స్నేహితురాలిని తన పక్కన కూర్చోమంది.వాళ్ళిద్దరినీ బస్ ఎక్కించేసి రాగిణి, రాధికా దగ్గర్లోని మార్కెట్ కి వెళ్ళి కూరలు కొనుక్కుని ఇంటికి వచ్చారు.

"కాఫీ తాగుదాం, రాకూడదూ ?" రాగిణి అంది.

" ఈ రోజు మళ్ళీ స్వప్నిని మామూలుగా చూసేవరకూ నా మనసు కుదుటపడలేదనుకో. మదురై అమ్మ కి మొక్కాను కూడా" అంది రాగిణి. స్నేహితురాలి చేతిని ఆప్యాయంగా నొక్కింది రాధిక

కబుర్లలో టైము తెలియలేదు ఇద్దరికీ.

"ఇంక ఇప్పుడింటికేం వెళతావు? ఇక్కడే తినేద్దాం, పిల్లలొచ్చే టైముకి వెళుదువుగాని" అంటూ ఇద్దరికీ కంచాలు పెట్టి వడ్డించేసింది రాగిణి.

" కూటు చాలా బావుంది రాగిణీ, నువ్వెప్పుడూ బాగా చేస్తావు"అంది రాధిక.

"పిల్లలకి డబ్బాలో పెట్టాను, ఇస్తానుండు" అంది రాగిణి.

స్కూల్ నించి వస్తూనే ముందుగదిలో సోఫా మీద కూర్చుండి పోయింది స్వప్నిక.

సాహిల్ ఎప్పట్లాగే కబుర్లు మొదలుపెట్టాడు.

"ఏమయింది స్వప్నీ? అలా ఉన్నావేం? స్కూల్లో అసెంబ్లీ అయిందా? మిమ్మల్నిద్దర్నీ అభినందించారా? ఏమన్నారు ప్రిన్సిపల్?" అంటూ అడిగింది రాధిక

." బాగానే అయిందమ్మా, అలసటగా ఉంది కొంచం సేపు పడుకుంటాను" అంటూ మంచం మీద వాలింది స్వప్నిక.

" అన్నం తినవూ?, ఉండు ఏదైనా కలిపి తెస్తాను, తినేసి పడుకుందువు గాని" అంటూ వంటగదిలోకి నడిచింది.

" ఎందుకో చాలా వీక్ గా ఉందమ్మా, మధ్యాహ్నం స్కూల్ లో కొద్దిగా ఛాతీలో నొప్పిగా, మొన్న రేస్ రోజు లాగే అనిపించింది. కూ ర్చోవడానికి ఓపిక లేక పోతే సిక్ రూం కి పంపి రెస్ట్ తీసుకోమన్నారు టీచర్" అంది.

రాధిక కంగారు పడింది.

" అలసిపోయావు కన్నా, ఇదిగో అన్నం తిను. తిని పడుకుంటే తగ్గుతుందీ" అంది.

రెండు ముద్దలు తిని "ఆకలి లేదు, నిద్ర వస్తోం ది" అంటూ అక్కడే పడుకుండిపోయింది స్వప్నిక.

'ఓ రెండు రోజులు స్కూల్ కి వెళ్ళకుండా విశ్రాంతి తీసుకుంటే బావుంటుంది' అని రాధిక అంటే 'క్లాసులు పోతాయని, అదీ కాక అసెంబ్లీలో ప్రిన్సిపాల్ అందరిముందు పిలిచి బహుమతి ఇస్తారు, మెచ్చుకుంటారు. అవన్నీ ఎలా మిస్ అవడం? నేను హాయిగా ఉన్నానమ్మా' అంటూ వెళ్ళింది.

ఇప్పుడైనా ఓ రెండు రోజులు స్కూల్ కి వెళ్ళకుండా ఇంట్లో విశ్రాంతిగా ఉంటే మంచిది. అనుకుంది రాధిక.

కిరణ్ ఇంటికి వచ్చే సమయానికి నిద్రలేచి పాలు తాగి హోం వర్క్ చేసుకోసాగింది స్వప్నిక.

" బాగానే ఉంది కదా?" అన్నట్టు సైగ చేశాడు రాధిక వైపు. ఇద్దరూ వంటగదిలోకి వెళ్ళాకా వివరంగా చెప్పింది విషయమంతా.

కిరణ్ ఆలోచిస్తూ ఉండిపోయాడు.

" ఓ రెండు రోజులు స్కూల్ కి పంపద్దు, రెస్ట్ తీసుకోమందాం" అంది రాధిక ధృఢంగా.

" నిజమే" అన్నాడు కిరణ్ ఒప్పుకుంటున్నట్టుగా.

స్వప్నిక ఒప్పుకోలేదు. ఆ రోజు లెక్కల పరీక్ష ఉందనీ, అంతగా బావులేకపోతే అది రాసేసి, టీచర్ పర్మిషన్ తో తొందరగా వచ్చేస్తానని అంది.

" నాకు చెప్పక్కా, ఇద్దరం కలిసి ఇంచక్కా ఆటోలో వచ్చేద్దాం" అన్నాడు సాహిల్.

స్కూల్ బస్ లో కాక ఆటోలో వెళ్ళాలంటే ఇష్టం వాడికి.

వాడి మాటలకి అంతా నవ్వారు.

మర్నాడు మాములుగానే నిద్ర లేచింది. చురుగ్గా, హుషారుగా ఉన్న స్వప్నిక ని చూసి దంపతులిద్దరూ స్థిమితపడ్డారు.

కొద్దిగానే చాలంటూ టిఫిన్ తిని స్కూల్ కి వెళ్ళింది, అక్కవెనకే సాహిల్.

" రేపు డాక్టర్ దగ్గరకి తీసుకువెళ్దాం" అన్నాడు కిరణ్.

బయలుదేరేటప్పుడు ఉత్సాహంగానే ఉన్న స్వప్నికకి బస్ ఎక్కినప్పటినించే అనీజీగా అనిపించసాగింది.

పరీక్ష, వచ్చేవారం జరగబోయే డిబేటింగ్ కాంపిటీషన్ వివరాలు చెప్పేది ఈ రోజే అయ్యేసరికి వెళ్దామని అనుకుంది కానీ చాలా అలసట గా ఉంది.

క్లాస్ లో కూర్చున్నప్పటించీ చాతీలోనే కాకుండా ఒళ్ళంతా ఒళ్ళంతా విపరీతమైన నొప్పి, ముఖ్యంగా కీళ్ళ దగ్గర అవి విరిగి కింద పడతాయేమో అన్నంతగా నొప్పి మొదలైంది.

కడుపులో తిప్పుతున్నట్టుగా అనిపించసాగింది. చూస్తుండగానే ఒళ్ళు వెచ్చబడింది. దాంతో టీచర్ కంగారు పడ్డారు. ఆపైన రాధిక కి ఫోన్ చేశారు స్కూల్ వాళ్ళు.

విషయం విన్న రాధిక కంగారుగా స్కూటీ మీద బయలుదేరింది..

**ఈ పరుగు వచ్చే నెల దాకా.**

Post your comments